క్లుప్తంగా

అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండిని సమర్పిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారి వెండి పీటానికి దాతలు 111 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. సోమవారం పట్టణానికి చెందిన చినమిల్లి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి దంపతులు 100 గ్రాముల వెండి, బొల్లా దుర్గారావు, ఉమా దంపతులు 11 గ్రాముల వెండిని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి, ఘనంగా సత్కరించారు.

వృద్ధులకు వస్త్రాల పంపిణీ



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

భీమవరం: పట్టణంలోని తాడేరురోడ్డులోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం అంబేడ్కర్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పట్టణంలోని 38వ వార్డు లంకపేటకు చెందిన నల్లి జీవన్‌రాజు, అంకిత, నల్లి వసంతరావు, ఆనందరావు, పిల్లి క్లైరా ఆర్థిక సహకారంతో 55 మంది వృద్ధులకు సుమారు రూ.20 వేలు విలువ చేసే మహిళలకు చీరలు, పురుషులకు టవల్స్, షాట్స్, టీ షర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్‌ఫోర్స్ అధ్యక్షుడు గంటి ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

పాలిథీన్ కవర్లపై అపరాధ రుసుం



పాలిథీన్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ ఇన్‌చార్జి సాకేత్

ఆకివీడు: పాలిథీన్ కవర్ల వినియోగంపై నగర పంచాయతీ శానిటరీ సిబ్బంది మరో సారి దాడులు నిర్వహించారు. మార్కెట్‌లోనూ పలు దుకాణాల్లోనూ, బిర్యానీ పాయింట్లలో సోమవారం తనిఖీలు చేశారు. నగర పంచాయతీ శానిటరీ ఇన్‌చార్జి అధికారి సాకేత్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా షాపుల్లో ఉన్న పాలిథీన్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో షాపుకు రూ.300 చొప్పున 11 షాపుల నుంచి రూ.3,300 అపరాధ రుసుం వసూలు చేశారు.

షటిల్ కోర్ట్ ప్రారంభం



షటిల్ కోర్టును ప్రారంభిస్తున్న ఎస్పీ

భీమవరం: మానసిక వికాసానికి, శారీరక ధృఢత్వానికి క్రీడలు ఎంతో కీలకమని పోలీసుల పని ఒత్తిడిని జయించడానికి దోహదం చేస్తాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద షటిల్ కోర్ట్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.మారావు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) డి.సురేష్, కె.వెంకట్రావు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజెస్, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల చట్ట సవరణ నిలుపుదల చేయాలి

భీమవరం: సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్ (పెన్షన్) 1972కు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో సవరణలు చేసి పార్లమెంట్‌లో చేసిన చట్టం అమలు నిలిపి వేయాలని సోమవారం భీమవరంలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నిరసన కార్యక్రమం నిర్వహించింది. పి.సీతారామరాజు, సాగి అప్పలరాజు, ఏయూ భాస్కరరావు, షేక్ చాన్‌బాషా, సూర్యనారాయణ, వెంకట రామరాజు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

భీమవరం: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడికి నిరసనగా భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో సోమవారం జర్నలిస్టులు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్స్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా జూనియర్ కాలేజీ

వీరవాసరం: కార్పొరేట్ స్థాయి కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు విద్యా బోధనలో ముందుకు సాగుతున్నాయి. గత ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన హైస్కూల్ స్థాయి ప్లస్ టు జూనియర్ కళాశాలలో వీరవాసరం మండలం రాయకుదురులో ఏర్పాటు చేశారు. అనుభవం కలిగిన అత్యుత్తమ అధ్యాపక బృందంతో విద్యా బోధన చేస్తుండడం, ఉదయం, సాయంత్రం క్రమ శిక్షణతో కూడిన ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహించడంతో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుంది. 2024–25 ఇంటర్ ఫలితాల్లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సాధారణ విద్యార్థినులతో అసాధారణ ఫలితాలు సాధించి రాయకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. ఎంపీసీ 100 శాతం ఉత్తీర్ణతతో, బైపీసీ 86 శాతం ఉత్తీర్ణతతో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ గ్రూపులో 1000 మార్కులకు ఏలేటి ప్రశాంతి 948 మార్కులు, ఇళ్ల లక్ష్మీదుర్గ 945 మార్కులు, పోలిశెట్టి లక్ష్మీలావణ్య 937 మార్కులు సాధించారు. బైపీసీలో సరిపల్లి సృజన, కప్పల హాసిని 844 మార్కులు పొందారు. ఇదే కాకుండా తెలుగులో వందకి 99 మార్కులు 13 మంది, ఇంగ్లీషు 90కి పైన ముగ్గురు, మ్యాథమ్యాటిక్స్ 75కి 75 మార్కులు ఆరుగురు, ఫిజిక్స్ 60కి 60 ఇద్దరు, కెమిస్ట్రీ 60కి 60 ఇద్దరు బాటనీ 60కి 60 మార్కులు 8 మంది, జువాలజీ 60కి 60 ఒకరు మార్కులు సాధించి విజయ బావుటా ఎగుర వేశారు.



రాయకుదురులో ప్రచారం చేస్తున్న ప్రభుత్వ కాలేజీ సిబ్బంది

బైకులపై ప్రచారం

జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలంటూ కళాశాలకు చెందిన సిబ్బంది రాయకుదురు పరిసర గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి గ్రామాల్లో పెట్టారు. కరపత్రాలను ముద్రించి ఇంటింటికీ తిరుగుతూ కళాశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటున్నారు.

కరపత్రాల పంపిణీ

బాలిక విద్య భవిష్యత్తుకు భరోసా, ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అంటూ కరపత్రాలు ముదించి ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు పంచి, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత శ్రద్ధతో కూడిన విద్యా బోధన, ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా ఆధునిక విద్యా బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్స్, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం, ఈఏపీసెట్‌కు ఉచిత మెటీరియల్, కోచింగ్ ఇవ్వడం, విద్యార్థుల ఏకాగ్రత, జ్ఞాపకశక్తికి ప్రత్యేక యోగా, ధ్యాన శిక్షణ, ల్యాబ్ సౌకర్యం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, 2024–25వ సంవత్సరం 80 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం వారి సంఖ్యను 100కు పైగా అడ్మిషన్లు రప్పించాలని ముందుకు సాగుతున్నామని కళాశాల ప్రిన్సిపల్ కానుబోయిన శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది మెంటే అరుణ, పి.గురుమూర్తి, పూర్ణచంద్రరావు, బాలకృష్ణ, కాయల వీరాస్వామి, అంగర వేణు, తదితర సిబ్బంది పేర్కొంటున్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో వేసిన పాంప్లెట్

ఆనందంగా ఉంది



కార్పొరేట్ స్థాయికి దీటుగా మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి కావాలంటే రూ.1,50,000 నుంచి రూ.2 లక్షల ఖర్చు అవుతుంది. రాయకుదురు ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో పుస్తకాలతో పాటు అన్ని వసతులను ఏర్పాటు చేసి మంచి నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు. ప్రతి విద్యార్థి వీటిని సద్వినియోగపరుచుకుని పరిసర ప్రాంత గ్రామాల్లోని విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలి.

–గెద్దం భారతి, సర్పంచ్, రాయకుదురు

ఉచిత అంబులెన్స్ ప్రారంభం

వీరవాసరం: ఆపద సమయంలో, ప్రాణాపాయ స్థితిలో సహకారం అందించడం మానవత్వమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో దాతలు ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను సోమవారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో వబిలిశెట్టి రామకష్ణ, సర్పంచ్ శాంతిప్రియ, పిప్పళ్ల రామకష్ణ, రావుల సురేష్, జవ్వాది బాలాజీ, కోట్లేపర శ్రీను, పిప్పళ్ల రామకష్ణ, పిప్పళ్ల శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పంచారామ క్షేత్రమైన శ్రీసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానం ఈవో రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం భీమవరం పురపాలక సంఘం, విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేదం మనందరి బాధ్యతన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, నిషేధ కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రమణ్యం మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి ప్లాస్టిక్ నిషేధంపై వాడవాడలా ప్రచారం చేస్తున్నామన్నారు. అనంతరం 100 మంది భక్తులకు గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేగి రాణి, సీహెచ్ విశ్వనాథరాజు, మున్సిపల్ సెక్రటరీలు వీకేఆర్ రాజేశ్వరి, జి.శిరీష, కె.పెద్దిరాజు, పి.బేబీ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

భీమవరం అర్బన్: ఐసీడీఎస్ మే 20న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ కోరారు. మండలంలోని తోకతిప్ప గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్యక్రమంలో కె.మల్లేశ్వరి, పి.విజయకుమారి, కె. దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల తొలగింపు తీర్మానం తిరస్కరణ

పాలకోడేరు: మోగల్లు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంతంలో ఇళ్ల తొలగింపునకు పంచాయతీ పాలకవర్గం తీర్మానాన్ని తిరస్కరించింది. గత రెండు నెలల క్రితం ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్న 23 కుటుంబాలకు చెందిన గృహాలను తొలగించేందుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో 23 కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించాలని అధికారులను వేడుకున్నారు. బాధితులకు మరోసారి నోటీసులు జారీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, మండల కార్యదర్శి శేషపు ఆశ్రీయ బాధితులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణి దృష్టికి సమస్యను తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. అయితే కలెక్టర్ సమస్యపై సానుకూలంగా స్పందించినప్పటికీ ఇల్లు తొలగించేందుకు అధికారులు మరోసారి సిద్ధమయ్యారు. పంచాయతీ పాలకవ ర్గ సభ్యులు సర్పంచ్ మల్లిపూడి కృష్ణకుమారి అధ్యక్షతన ఇల్లు తొలగింపుకు తీర్మానం ఇచ్చేందుకు నిరాకరించారు.

బాధితులకు ప్రత్యామ్నాయం చూపించాలి

పాలకోడేరు: ఉండి నియోజకవర్గంలో కూల్చిన పేదల ఇళ్లకు వెంటనే నష్ట పరిహారం, ఇస్తామన్న ప్రత్యామ్నాయ స్థలాల్లో పూర్తి స్థాయి ఇళ్ల నిర్మాణం చేసి తొలగించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏఎస్ఆర్ నగర్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా బృందం బాధితులను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో 110 పేద కుటుంబాలు సుమారు 50 ఏళ్ల నుంచి నివసిస్తున్నారన్నారు. నేడు ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు అభివృద్ధి పేరుతో ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్నారు. ఈ మేరకు ప్రత్యామ్నాయం చూపించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కానేటి బాలరాజు, చిన్నం చిన్న నాగేశ్వరరావు, మాదాసి గోపి, గొల్ల ఏడుకొండలు, ప్రసాద్, దుర్గా ప్రసాద్, శేషపు అశ్రియ్య, దున్నా మరియమ్మ పాల్గొన్నారు.



పాలకోడేరు: బాధితులతో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు



కాళ్ల: మాట్లాడుతున్న సీపీఎం నేత గోపాలన్

పేదల ఇళ్లు కూల్చడమే అభివృద్ధా?

కాళ్ల: అభివృద్ధి అంటే పేదల ఇల్లు కూల్చడమా అని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. ఉండి నియోజకవర్గంలో కాలుష్యం పేరుతో పేదల ఇళ్లను తొలగించటంపై సీపీఎం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఉండి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న, వారి ఇళ్ల కూల్చివేతకు గురైన పేదల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకునేందుకు చేపట్టిన బైక్ యాత్ర సోమవారం కాళ్ల మండలం వేంపాడు, బొండాడ, కాళ్ల, జువ్వలపాలెం గ్రామాల్లో సాగింది. గోపాలన్ మాట్లాడుతూ కాలుష్యానికి కారణం ఏంటి, దాని నివారణ చర్యలు చేపట్టకుండా పేదల ఇల్లు కూల్చడం ఎంత వరకు సమంజసం అన్నారు. జక్కంశెట్టి సత్యనారాయణ, గొర్ల రామకృష్ణ, దనికొండ శ్రీనివాస్, కె.తవిటినాయుడు, చీర్ల శేషు, బీవీ వర్మ, చందక సూరిబాబు, ఎస్‌కే వలి, నిమ్మితి కిషోర్, తిరుమాని శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

ఉండి: తనపై నమ్మకం ఉంచి తనకు అప్పగించిన రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి పదవికి న్యాయం చేసి పార్టీ బోలపేతానికి కృషి చేస్తానని కరిమెరక రామచంద్రరావు అన్నారు. సోమవారం నియోజకవర్గ పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజును రామచంద్రరావు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో ఎన్నో పదవులు అధిరోహించానని తెలిపారు. రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చి నాపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి పీవీఎల్ తన భుజాలపై ఎంతో భాధ్యత పెట్టారరు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే ప్రధానంగా పని చేస్తానన్నారు.



పీవీఎల్‌ను కలిసిన రామచంద్రరావు

కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ నిర్వహణ

భీమవరం(ప్రకాశం చౌక్): కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ ద్వారా యువతులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌పై సంబంధిత శాఖలకు పలు సూచనలను జారీ చేశారు. కిషోర వికాసం సమ్మర్ క్యాంప్ ప్రతి గ్రామం, వార్డుల్లో కిషోర బాలికలకు ముఖ్యంగా 15–18 మధ్య వయసు కలిగిన అమ్మాయిలకు గ్రూప్స్‌గా ఏర్పాటు చేసి ప్రతి మంగళ, శుక్రవారాలలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, వీవోహెచ్‌లు కలిసి దాదాపు 12 అంశాలపై కార్యక్రమం నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మే 2 నుంచి జూన్ 10 వరకు ఈ సమ్మర్ క్యాంప్ నిర్వహించాలన్నారు. మండల అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలి

భీమవరం: ధాన్యం తూకాల్లో మోసాలను అరికట్టాలని, సరైన గోనె సంచులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ధాన్యం పట్టుబడి సమయంలో సంచితో కలిపి 40 కిలోల 500 గ్రాముల తూకం వేయాలని అదనంగా 700 గ్రాములు తూస్తున్నారన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ఇచ్చే సంచుల్లో 40 శాతం చిరిగిపోయి ఉంటున్నాయని చిల్లులు లేని సంచులు సరఫరా చేయాలన్నారు. జియోట్యాగ్‌తో సంబంధం లేకుండా రైతులు సొంతంగా ఏ వాహనాన్నైనా ఆన్‌లైన్ చేయించుకుని ధాన్యం పంపుకునే విధంగా సౌకర్యం కల్పించాలని రామాంజనేయులు కోరారు.

దాడి కేసు నమోదు

ఉండి: ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ సర్ది చెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై ఒక వర్గం వారు దాడి చేయడంతో ఆ వ్యక్తి ఆసుపత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహదేవపట్నం గ్రామానికి చెందిన కవురు శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన జుత్తిగ దుర్గా అనే వ్యక్తితో పాత గొడవల నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన గొడవ పడటంతో ఏంటి గొడవ అని అడిగేందుకు వెళ్లిన కవురు దుర్గామల్లేశ్వరరావును జుత్తిగ దుర్గాతో పాటు మరో ఇద్దరు కాళ్లచేతులపై కొట్టి గాయపరిచారు. దీంతో అతడు భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఏఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధులకు శిక్షణ

ఉండి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తాడేపల్లిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి జిల్లా అధికార ప్రతినిధి గొర్రుముచ్చు సుందర్ కుమార్, పార్టీ మేధావి విభాగ అధికార ప్రతినిధి ఈదా జాషువా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, పలు అంశాలపై శిక్షణ అందించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రజాపక్షంగా పోరాటం చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకున్న కూటమి నాయకులు హామీలను అమలు చేసేలా ప్రజలకు న్యాయం జరిగేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశంతో ముందడుగు వేయబోతున్నట్లు వారు తెలిపారు.



తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో శిక్షణకు హాజరైన సుందర్‌కుమార్, జాషువా

‘పది’ విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలలో చదివి పదో తరగతిలో మండల ఫస్ట్ సాధించిన స్థానిక జెడ్పీ స్కూల్ విద్యార్థిని కొల్లు శాన్వికి పూర్వ విద్యార్థులు రూ.13 వేల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పాఠశాల ఆవరణలో సోమవారం 1981–82 బ్యాచ్ విద్యార్థుల తరపున అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని అభినందించి, నగదును అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొప్పర్తి సత్యనారాయణ, పెద్దిరాజు, ఆర్‌వీఎస్ నారాయణ, గోపాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు తోట పోతరాజు, ఉపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి, టి.వెంకటేశ్వరావు, అరవింద్, బాబూరావు, సత్యనారాయణ, రామ్మోహనరావు, పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం

భీమవరం: పట్టణంలోని బేతనీపేటకు చెందిన గంటా అనూష, గంటా పౌలినా ఏంజిలన్ సంగీతంలో గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రపంచ స్థాయి సంగీత కార్యక్రమం నిర్వహించగా 18 దేశాలకు చెందిన 1,090 మంది ఆన్‌లైన్ ద్వారా కీబోర్డుపై సరళీ స్వరాలు వాయించగా వారిలో 1,046 మంది అర్హత సాధించి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించారు. సంగీతంపై ఆసక్తితో అనూష, పౌలినా ఏంజిలిన్ విజయవాడ మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో దండింగి అగస్టీన్ ఆధ్వర్యంలో నడుస్తున్న హల్లెల్ మ్యూజిక్ స్కూల్‌లో ఉచిత శిక్షణ పొందుతున్నారు. గిన్నిస్ రికార్డు సాధించిన అనూష, పౌలినా ఏంజిలిన్‌ను పలువురు సంగీత బోధకులు, క్రైస్తవ సంఘం నాయకులు అబినందించారు.



అనూష, పౌలినాలను అభినందిస్తున్న అగస్టీన్

జీవితాంతం తోడుండేది పుస్తక జ్ఞానమే



భీమవరం: వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు



ఆకివీడు: కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత హెచ్‌ఎం కె.రాజరాజేశ్వరి

ఆకివీడు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంతి ప్రధానోపాధ్యాయురాలు కాకర్ల రాజ రాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయం వద్ద వేసవి ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా వచ్చే విజ్ఞానం మన జీవితాంతం తోడుగా ఉంటుందన్నారు. విద్యార్థులు ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, ఉపాధ్యాయులు కిషోర్, గ్రంథాలయ పాలకురాలు పార్వతి , విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు

భీమవరం: పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని రిటైర్డ్ ఉపాధ్యాయుడు కలిగొట్ల గోపాలశర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో మేధాశక్తిని పెంపొందించుకునేందుకు, ప్రాపంచిక విషయాలు తెలుసుకునేందుకు పుస్తక పఠనం చేయాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంధి కేవీవీ ప్రసాద్, వడ్డి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



స్వామి వారికి మహా నివేదన చేస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి 14వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 21వ తేదీ నుంచి 8 రోజుల పాటు సాగిన శ్రీవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు సంప్రదాయ బద్ధంగా ముగిశాయి. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు పర్యవేక్షణలో అర్చకులు శ్రీనివాసాచార్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి మహా నివేదన చేసి అన్న సమారాధనను ప్రారంభించారు. కుక్కల బాల, సరిపిడకల రామారావు, జానపాటి మధు, పెన్నడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు, అల్లు రామారావు, అల్లం రమేష్, చెరుకువాడ రంగసాయి, నళిని మోహన్, మామిడిశెట్టి జయ కుమార్, కట్టా లక్ష్మణ స్వామి, కడలి ఫణి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు అభివృద్ధి పథంలో నడవాలి

వీరవాసరం: విద్యార్థులు అభివృద్ధి పథంలో పయనించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పీకేఎల్ఎల్ఎస్ నారాయణ తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రథమ, ద్వితీయ శ్రేణి విద్యార్థుల సత్కార కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ విద్యాశాఖ అధికారి నారగాని రమేష్, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవాని, జెడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, ఎంఈవో శ్రీమన్నారాయణ, సర్పంచ్ చిక్కులే మంగతాయారు, ఎంపీడీవో అప్పారావు, గెద్దం భాస్కరరావు, దాడి కాశీ వెంకట నరసింహం , ఎరకరాజు చినబాబు, కడలి నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న అధికారులు

పీజీఆర్ఎస్‌కు స్పందన కరువు

ఆకివీడు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సోమవారం ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉక్కబోత వాతావరణంలో అధికారులు నాలుగు గోడల మధ్య ఉండిపోయారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు సరైన పరిష్కారం లభించకపోవడంతో ఫిర్యాదుదారులు తీవ్ర నిరుత్సాహంతో స్పందనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మండలంలోని 16 గ్రామ పంచాయతీలు, నగర పంచాతీయ పరిధిలో ఒక్క సమస్య కూడా లేకుండా ప్రజలు ఉన్నారని దీనిని బట్టి అర్థమవుతోందని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.